

# మానసమయూరి

- కస్తూరి మురళీకృష్ణ



*(గత సంచిక తరువాయి)*

**ఇంటి తలుపు** తెరచి సోఫాలో కూర్చుని కన్నీరు కార్చటం ఆరంభించింది ప్రశాంతి.

ఆమెవైపు చూస్తూ కాస్సేపు నిలబడ్డాడు శరత్. తరువాత మౌనంగా తన గదిలోకి వెళ్లిపోయాడు.

మనిషికి దుఃఖం ఎందుకు కలుగుతుంది? అన్న ఆలోచన కలిగింది అతనికి.

పిల్లలు పెద్దవాళ్ళయిపోయారు.

వాళ్లకేం కావాలో వాళ్లు నిర్ణయించుకున్నారు.

వాళ్ల నిర్ణయాన్ని అనుసరించి సుఖమో, దుఃఖమో వాళ్లే అనుభవిస్తారు. దాన్లో తమకు ఎందుకు దుఃఖం?

తమ మాట వినలేదనా?

తమ అభిప్రాయం అడగకుండా, సలహా తీసుకోకుండా స్వయంగా నిర్ణయం తీసుకున్నారనా?

ఎందుకు దుఃఖం?

వాళ్ల ఇష్టం వాళ్లది. ఎవరి ఇష్టం వాళ్లది. ప్రపంచంలో ఘర్షణలు, దుఃఖాలు సర్వం ఎదుటివాడు తన ఇష్టం ప్రకారం నడుచుకోవాలన్న పట్టుదలవల్ల వస్తాయి. దీనికి మూలం 'అహం'

అందుకే శాస్త్రాలు 'అహం'ను అదుపులో పెట్టుకోమన్నాయి. అహాన్ని జయించిన వాడికి దుఃఖం ఉండదని అన్నాయి.

ఆలోచిస్తున్న శరత్ అలికిడి అవటంతో తల ఎత్తి చూశాడు.

ప్రశాంతి వచ్చి అతడి పక్కన కూర్చుంది.

'జీవితానికి అర్థం ఏమిటి?' అడిగింది సూటిగా.

శరత్ మాట్లాడలేదు.

ఇంతలో ఇద్దరి దృష్టి నేలమీద జరజర పాకుతున్న చీమల గుంపుమీద పడింది.

ఒక వరుసలో గబగబా పోతున్నాయి చీమలు. అవన్నీ ఏదో తెల్లటి పదార్థాన్ని మోస్తున్నాయి.

ఇద్దరూ మౌనంగా, ఏకాగ్రతతో చీమలను గమనించసాగారు. అలా చూస్తూంటే వారిద్దరికీ వేదన తగ్గి ఏదో సాంత్వన కలుగుతున్నట్టుంది.

ఇంతలో వారి దృష్టి 'టపటప' శబ్దం చేస్తున్న బల్లివైపు మళ్లింది.

అది గోడమీద పాకుతోంది పురుగులేవైనా ఉన్నాయేమో చూస్తోంది. ముందుకు సాగుతోంది.

మరోవైపు గోడ. అందులో సాలెపురుగు చకచకా గూడు అల్లుతోంది. ఎంతో అందంగా అల్లుతోంది.

ప్రశాంతికి సాలెగూడు నచ్చదు. 'ఇంట్లో బూజు దరిద్రం' అంటుంది. అందుకే ఆమె దృష్టి సాలెగూడుపై పడగానే వెంటనే లేచి మూలనున్న బూజు దులిపే కర్ర తీసుకుంది. బూజు దులపబోతూ శరత్ వైపు చూసింది.

ఇద్దరి కళ్లు కలుసుకున్నాయి.

ఆమె చేతిలోని బూజు కర్ర గాలిలోనే ఆగిపోయింది.

మెల్లిగా పాడాడు శరత్.

తూనే తిన్‌న్ తిన్‌న్ చున్‌కర్ నగరీ ఏక్ బనాయీ

బారిష్ మే తెరి భీగీ ఫాంకే, ధూప్ మె గర్మీ భాయీ

గమ్ న కర్ జో తేరీ మెహనత్, తేరే కామ్ న ఆయా

తేరీ కిస్మత్ మే లిఖాహై జీత్ జీ మర్ జానా...

ఆమె చేతిలోంచి కర్ర జారిపోయింది.

ఎంతో కష్టపడి ఒక్కో చితుకూ ఏరి పిట్ట గూడు కడుతుంది. ఆ గూడు కట్టటంలో ఎండకు ఎండి, వానకు తడిసి కష్టపడుతుంది. పిట్ట గూడు తనకోసం కట్టదు. గుడ్లు పెట్టే సమయంలో కడుతుంది. పిల్లల కోసం కడుతుంది. అంత శ్రమపడి కష్టనష్టాలకోర్చి అది గూడు కట్టి గుడ్లు పెడుతుంది. అలా పెట్టిన గుడ్లలో ఎన్ని పిల్లలవుతాయో తెలియదు. అలా పిల్లలయినవి ఎన్ని బ్రతికి రెక్కలార్చి ఎగరగలుగుతాయో తెలియదు. అలా పిల్లలయినవి ఎన్ని బ్రతికి రెక్కలార్చి ఎగరగలుగుతాయో తెలియదు. అంతవరకూ అన్ని కష్టాలను అనుభవిస్తూ పిట్ట పిల్లల రక్షణకోసం తపిస్తుంది. వాటి ఆహారం కోసం శ్రమిస్తుంది. తీరా ఎదిగిన తరువాత పిల్లలు, రెక్కలు అల్లలార్చి ఎగిరిపోతాయి. వెనుతిరిగి చూడవు.

అందుకే కవి 'నీ కష్టం నీకు ఫలితాన్ని ఇవ్వమన్నా బాధపడను. నీ అదృష్టం ఇంతే' అంటున్నాడు.

'మనుషులకూ పిట్టలకూ, ఇతర జంతువులకూ తేడాలేదా?' అడిగింది కోపంగా.

అన్ని జీవులకూ ఆహార, భయ, మైధునాలు సమానమే. సంతానాన్ని కనటం, దాన్ని పెంచటం సమానమే. కానీ సంతానం మీద హక్కు ఉందనుకుని, తాను చెప్పినట్టు అది వినాలనుకుని, దాని భవిష్యత్తును నిర్దేశించాలనుకునేది మానవుడు ఒక్కడే' అన్నాడు శరత్.

'అంటే మనిషి జంతువులలాగా, ఎలాంటి అనుబంధాలు, భావనలు లేకుండా ఉండటమే ఉత్తమం అంటారా?'

'కావచ్చు. మెదడు వాటికీ ఉంది. మనకూ ఉంది. కానీ, మనం చేస్తున్న పని పట్ల భావన, మనిషికే ఉంది అందుకే మనం ఇది నాది. అది నీది. ఇదినేను అది నీవు అనుకుంటాం. ఈ చైతన్యం వల్లనే మనకు కాలం స్పృహ ఏర్పడింది. జీవులన్నిటికీ ఈ స్పృహ ఉంది. అందుకే ఋతువులను బట్టి వాటి చర్యలుంటాయి. ఎండాకాలం వచ్చిందని, ఆహారం సంపాదించి దాచుకోవాలి. రాబోయే వర్షాకాలం కోసం అని చీమకూ తెలుసు. దాని స్పృహ అంతవరకే. కానీ ఇలాంటి కాలాలు వస్తూంటాయని, సంవత్సరాలు గడుస్తాయన్న స్పృహ మనిషిది. అదీ తేడా. అందుకే సృష్టిలక్షణాన్ని పరిశోధించి, పరిశీలించి, విశ్లేషించిన మన పూర్వీకులు సృష్టిలోని జంతులక్షణాలన్నీ మనిషిలో నివిడీకృతమై ఉన్నాయని గ్రహించారు. వాటికి తోడు, వాటిలో లేని ఈ 'అధిక చైతన్యం 'సృజన'గా వ్యక్తమౌతుంది. తను చైతన్యాన్ని గుర్తించలేని వారు జంతువులలాగే జీవితాన్ని వెళ్లదీస్తారు. పుడుతారు. పెరుగుతారు, కంటారు, పెంచుతారు, పోతారు.. అంతే.. ఇంత రొటీన్ జీవితాన్ని అర్ధవంతం చేసుకోవాలంటే, ఇదిగో ఈ చైతన్యంపై నియంత్రణ సాధించాలి. మన వ్రతాలు, యజ్ఞాలు, పూజలు, సాధనలు అన్నీ దీనికోసమే. మనిషి జంతువుకన్నా ఉత్తముడయినా, తనలోని జంతు ప్రవృత్తిని అదుపులో పెట్టుకుని, తనను ప్రత్యేకమైన చైతన్యాన్ని నియంత్రణలో ఉంచుకోవటం ఉత్తమం'

శరత్ వైపు విచిత్రంగా చూసింది ప్రశాంతి.

'ఇవన్నీ చెప్పటానికి బాగుంటాయి. కానీ ఆచరణలో సాధ్యంకాదు అందరికీ' అంది.

'అవును. కానీ ఎలాగయితే ఉలితో కొడుతూ ఉంటే, ఏదో ఓనాడు రాయి ముక్కలవక తప్పదు. అలాగే మనం ఆచరించలేకపోయినా, మంచిని తలుస్తూండటం, పదిమందికీ చెప్తూండటంవల్ల ఏదో ఒకనాడు ఆ మంచి కొంత మనకూ అంటకపోదు. ఆ ఆశతోనే మనం విఫలమయినా, మంచి చెప్తూ పోవాలి.'

నవ్వింది ప్రశాంతి 'పోనీండి. దొరికిందే ఛాన్సని లెక్చరిచ్చేశారు. చాలాకాలం తరవాత మీకు దొరికిపోయాను. అసలు ఈ మధ్య కాలంలో మనకు మనసు విప్పి మాట్లాడుకోవటానికి సమయమే చిక్కటంలేదు' అంది ప్రశాంతి అతడి భుజం మీద తలవాల్చి.

'మన జీవితంలో మలిదశ ఆరంభమవుతోంది ప్రశాంతి. బాధ్యతలన్నీ తీరిపోయాయి. ఇక మనకోసం మనం బ్రతకటం ఆరంభమవుతుంది. ఇదీ మన జీవితంలోని అత్యద్భుతమైన దశ. మనకోసం మనం సమయం వెచ్చించటం. ఇప్పుడు ఏదో సాధించాలని లేదు. ఎవరికో ఇవ్వాలని లేదు. ఎవరికో ఏదో చేయాలనీ లేదు. మనం మనకోసం మనలాగే బ్రతకటం' అన్నాడు శరత్ ఆమెని దగ్గరకి తీసుకుంటూ.

'అమ్మాయి వస్తోంది' ఎక్సయిట్‌మెంట్‌తో చెప్పింది ప్రశాంతి.

నిర్లిప్తంగా చూశాడు శరత్ ఆమెవైపు.

స్రవంతి వస్తున్నట్టు చెప్పినప్పటి నుంచీ ప్రశాంతి మారిపోయింది. అంతవరకూ నిస్సత్తువుగా కూర్చున్నదల్లా క్షణంలో ఉత్సాహవంతం అయింది.

చకచకా ఇల్లంతా శుభ్రం చేసింది తినుబండారాలు తీసుకురమ్మని శరత్‌ని తరిమింది.

ఇల్లు శుభ్రం చేసి, సర్దిన తరువాత దేవుడి పటాలపై స్వచ్ఛమైన తెల్లటి దుప్పటి కప్పింది.

'అంతా బాగానే ఉందికదా. ఎక్కడా దేవుడి పటాలు లేవుకదా? ' అడిగింది ఇల్లంతా కలయచూస్తూ.

ఆమెను చూస్తూంటే, కొద్దిసేపటి క్రితం విషాద వదన అయి 'ఏదీ తనది కాదు' అన్నట్టు ఉన్న మనిషి ఈమెనే అనిపించటంలేదు.

'వస్తున్నది మన కూతురే. దానికి ఇల్లు కొత్తకాదు' అన్నాడు శరత్ ఆమె హడావిడి చూసి.

'అది కొత్తకాదు. దానితో వస్తున్నవాళ్లు కొత్త' అంది.

ఇంతలో బయట కార్లు ఆగిన శబ్ధం వినిపించింది.

శరత్ తొంగి చూశాడు.

నాలుగయిదు కార్లు ఆగాయి. వాటిల్లోంచి మనుషులు దిగుతున్నారు. ఆ దిగుతున్న వాళ్ళలో స్రవంతిని పోల్చుకున్నాడు శరత్.

పూర్తిగా క్రిష్టియన్ అమ్మాయిలా ఉంది.

ముఖాన బొట్టులేదు. దుస్తులు మారిపోయాయి. పెదిమలకు లిప్‌స్టిక్‌తో స్రవంతి పునర్జన్మ ఎత్తినట్టుంది క్రిష్టియన్‌గా.

'ఈమెని చూస్తే ప్రశాంతి ఏమనుకుంటుందో?' అనుకున్నాడు శరత్.

ఆమె వైపు చూశాడు.

టేబుల్‌ని గది మధ్యలో ఉంచి, అన్నీ సక్రమంగా ఉన్నాయో, లేదో చూస్తోంది.

ఒకరొకరుగా రావటం ఆరంభమయింది.

ముందుగా స్రవంతి ఓ అబ్బాయిని పరిచయం చేసింది. 'నాన్నా, ఈయనే..' అని.

శరత్ షేక్‌హ్యాండ్ ఇచ్చాడు.

ఏదో అనేలోపలే వారిని తోసుకుంటూ తెల్ల దుస్తులు వేసుకున్న వ్యక్తి వచ్చాడు.

'నాన్న.. ఫాదర్' అంది స్రవంతి.

శరత్‌కి నవ్వు వచ్చింది. తాను తండ్రి అంటే ఫాదర్. అతడు ఫాదర్. కొత్త ఫాదర్ అనుకున్నాడు. అతడు శరత్‌కి విష్ చేసి ఏదో తనలో తాను గొణుక్కుంటూ లోపలకు వెళ్లాడు. తన చేతిలోని కలశంలాంటి దాంట్లోంచి నీటి చుక్కలు ఇంటి నాలుగువైపుల చల్లాడు.

'కం ఇన్ డియర్స్' అన్నాడు.

ఒకరొకరుగా లోపలకు వెళ్లారు.

అంటే ఆయన ఇంటిని శుద్ధి చేశాడన్నమాట.

శరత్‌కి నవ్వు వచ్చింది.

అందరూ వచ్చి కూర్చున్నారు.. అందరికీ అమ్మ, నాన్నని పరిచయం చేసింది స్రవంతి.

'మీరు పెళ్ళికి రాలేదు. మీకు పెళ్లి ఇష్టంలేదా?' అడిగాడు ఫాదర్ సూటిగా.

'మాకు తెలియదు. పెళ్లి అయిన తరువాత చెప్పింది' చెప్పాడు శరత్. అతడికి ఎలాగో అనిపించింది. తన కూతురి మీద వేరే వారికి తాను ఫిర్యాదు చేస్తున్నట్టనిపించింది.

'దిసీజ్ వెరీ బ్యాడ్ తల్లిదండ్రుల అనుమతితో వివాహం కావాలి.' అన్నాడు ఫాదర్.

శరత్ వైపు తిరిగి 'మీకు క్రిష్టియన్ మతాన్ని స్వీకరించటంలో అభ్యంతరం లేదుకదా?'అడిగాడు.

అయోమయంగా కూతురివైపు చూశాడు శరత్. 'ఎవరు స్వీకరించటం?'

'తన కూతురా? తానా?'

Post your comments

*(కొనసాగింపు వచ్చే సంచికలో)*